హామీలు అమలు చేయకుండా.. ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావ్ ?: ఈటల
2లో

తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT
ఎడిటర్: బక్క రవీందర్
శనివారం 31, ఆగస్టు 2024

## సమస్య ఏదైనా
దాని వెనుక ఎవరున్నా....
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707





# పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- టూరిజంపై నూతన విధానాన్ని రూపొందించాలన్న రేవంత్
- ఎకో, టెంపుల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన
- హైదరాబాద్ వెలుపల మరో జూపార్క్ అభివృద్ధికి ప్లాన్ తయారు చేయాలని ఆదేశం

**హైదరాబాద్:** తెలంగాణలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కొత్త పాలసీని విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ పాలసీలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఎకో టూరిజం, హెల్త్ టూరిజం, టెంపుల్ టూరిజంలకు విడివిడిగా పాలసీలను రూపొందించాలని తెలిపారు. స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ ప్రాజెక్టుల్లో భాగంగా డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక రంగ అభివృద్ధిపై జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో పర్యాటక రంగానికి సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.తెలంగాణలో ఉన్న వనరుల అభివృద్ధికి అవసరమైన చోట పీపీపీ విధానాన్ని అవలంభించాలని సూచించారు. కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిం చాలని, కొన్ని చోట్ల రాత్రి విడిది ఉండే కాటేజీలను నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. జామ్ నగర్ లో అనంత్ అంబానీ మూడు వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద, అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్స్టిట్యూట్ తరహాలో నేచర్ వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.హైదరాబాద్ ఫోర్త్ సిటీలో

మిగతా 2లో

# అధైర్య పడొద్దు.. అండగా నేనున్నా : చంద్రబాబు



**అమరావతి:** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారనే అంశంపై పూర్తి స్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి విచారణ సాగుతోన్న విధానంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రతి 3 గంటలకోసారి తనకు రిపోర్ట్ చేయాలని అధికారులకు నిర్దేశించారు. మన ఇంట్లో ఆడబిడ్డలకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో.. అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలని సీఎం అన్నారు.విద్యార్థినుల ఆందోళన, ఆవేదనను పరిగణలోకి తీసుకుని పటిష్ట దర్యాప్తు చేయాలని ఆదేశించారు. నేరం జరిగినట్లు రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఫిర్యాదు చేసినా యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలపైనా విచారణ జరపాలని.. కాలేజీ యాజమాన్యం, అధికారుల అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరూ అధైర్య పడొద్దని.. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటు ందని హామీ ఇచ్చారు.కాగా, ఈ ఘటనపై ఆందోళన చేస్తున్న విద్యార్థినులతో మంత్రి కొల్లు రవీంద్ర పలు దఫాలుగా చర్చలు జరిపారు. మంగళవారం నాటికి విచారణ పూర్తి చేసి, బాధ్యులను శిక్షిస్తామని వారు హామీ ఇచ్చారు. ఎటువంటి వీడియోలు బయటకు రానీయకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థినులకు రక్షణగా మహిళా పోలీసు టీంను ఏర్పాటు చేశారు. మంత్రి రవీంద్ర హామీలకు అంగీకరించిన విద్యార్థినులు తమ ఆందోళనను విరమించారు. విచారణ పూర్తి అయ్యే వరకు తరగతులకు హాజరుకాకూడదని విద్యార్థినిలు నిర్ణయించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో అమ్మాయిల వాష్ రూంలో సీక్రెట్ కెమెరా ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. విద్యార్థినుల హాస్టల్ వాష్ రూంలో హిడెన్ కెమెరా ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలంటూ జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు చంద్రబాబు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్ రావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఇంజనీరింగ్ కాలేజికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ వ్యవహారం వెలుగులోకి

మిగతా 2లో

# ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ

- ఘటనపై శిరస్సు వంచి క్షమాపణలు చెప్పిన ప్రధాని మోదీ
- శివాజీ కేవలం మహారాజు మాత్రమే కాదని, గౌరవనీయ వ్యక్తి అన్న ప్రధాని
- గౌరవనీయ వ్యక్తులు, దైవం కంటే మనకు గొప్పది ఏదీ లేదని వ్యాఖ్య



సింధుదుర్గ్ లో 35 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు కోరారు. ఈ ఘటనపై తాను శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నానన్నారు. మనందరికీ శివాజీ కేవలం మహారాజు మాత్రమే కాదని, ఆయన మనందరికీ గౌరవనీయమైన వ్యక్తి అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో వద్వన్ ఓడరేవు,ఇతర ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడారు. ఛత్రపతి శివాజీని తమ పూజ్య దైవంగా ఆరాధించే వారందరి మనోభావాలు ఈ విగ్రహం కూలిపోవడం వల్ల దెబ్బతిని ఉంటాయి. అందుకే నేను క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. తన సంస్కారం పూర్తిగా భిన్నమైనదని, మనకు గౌరవనీయ వ్యక్తులు, దైవం కంటే గొప్పది ఏదీ లేదన్నారు. గత ఏడాది నేవీ డే

మిగతా 2లో



# పాక్‌తో చర్చలు బంద్.. చర్యకు ప్రతిచర్యే: జై శంకర్

పొరుగుదేశం పాకిస్థాన్‌తో చర్చల ప్రక్రియ ప్రస్తుతానికి అనిశ్చిత స్థాయిలో ఉందని విదేశాంగ మంత్రి జై శంకర్ తెలిపారు. ఇప్పటివరకూ పాక్‌తో చర్చల్లో ప్రతిష్టంభన ఉంది. ఇప్పుడీ ఘట్టం కూడా ముగిసినట్లే అని ఆయన అన్నారు. అన్నింటినీ తేలిగ్గా తీసుకునే ఉదాసీతతో వ్యవహరించడం భారత్‌కు కుదరదని స్పష్టం చేశారు. ఆ దేశంతో పరిస్థితి పట్ల ఆశాభావం అయితే ఇప్పటికీ లేదన్నారు. ఏదైనా జరిగితే దానికి అనుగుణంగా వెంటనే స్పందించడం అనివార్యం అవుతుందన్నారు. చర్యలకు ప్రతిచర్యలు , ఎదుటి పక్షం పనిని బట్టి పరిణామాలు ఉంటాయన్నారు. చర్చలు , ఉగ్రవాదం ఒకేసారి కుదరవని, ఒకటి జరిగితే ఇంకోటి వదులుకోవల్సి ఉంటుందన్నారు. పాకిస్థాన్ ఎప్పుడూ సీమాంతర ఉగ్రవాదాన్ని నమ్ముకుని ఉంటుంది. చర్చలు సాగేందుకు దీనితో వీలవుతుందా? అని నిలదీశారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి మాట్లాడారు. ప్రపంచంలో ఏ దేశానికి అయినా

మిగతా 2లో

# ఆ విషయంలో ఇంకా మార్పులు చేయాల్సి ఉంది: రాజ్‌నాథ్ సింగ్



**తిరువనంతపురం:** దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, నేరాలను చూస్తుంటే ఎన్ని మార్పులు చేసినా ఇంకా చేయాల్సింది ఉందనిపిస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో ఓ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో ముచ్చటించారు. అత్యాచార నిందితులకు శిక్షలు మరింత కఠినతరం చేసేలా ప్రభుత్వ సవరణలు చేసిందన్నారు. మరణశిక్ష విధించేలా చట్టంలో మార్పులు చేశామని పేర్కొన్నారు. మహిళలపై నేరాల విషయంలో కేంద్రం కఠిన వైఖరి అవలంబిస్తున్నప్పటికీ రాష్ట్రాలు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు.ఇవాళ భారత దేశాన్ని ప్రపంచం భిన్నమైన కోణంలో పరిశీలిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం పట్ల ఔన్నత్యం, గౌరవం పెరిగిందని ప్రశంసించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉక్రెయిన్ పర్యటనలో ఉన్నారని, కొద్ది రోజుల క్రితం రష్యా పర్యటనకు కూడా వెళ్లారని రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేశారు. రష్యా, ఉక్రెయిన్‌లు ఒకరితో ఒకరు యుద్ధం చేస్తున్న సమయంలో పిఎం నరేంద్ర మోడీ

మిగతా 2లో

# జపాన్‌లో బియ్యం కొరత.. సూపర్ మార్కెట్లలో నో స్టాక్ బోర్డులు

- భారీ భూకంపం హెచ్చరికల నేపథ్యంలో ఇంట్లో స్టాక్ పెట్టుకుంటున్న జనం
- ఈసారి నీటి కొరత కారణంగా తగ్గిన వరి ఉత్పత్తి
- సెప్టెంబర్ నెలాఖరుకు పంట చేతికి వస్తుందని మంత్రి వివరణ




ఓవైపు భారీ భూకంప హెచ్చరిక.. మరోవైపు విరుచుకు పడుతున్న తుపాన్లతో జపాన్ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యావసర వస్తువులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే జపాన్ లో బియ్యానికి కొరత ఏర్పడింది. ఏ సూపర్ మార్కెట్లో చూసినా నో స్టాక్ బోర్డ్ లే దర్శనమి స్తున్నాయి. రోజువారీగా తెప్పించిన

మిగతా 2లో

# నువ్వే అసలు దొంగ..
## - హరీష్ రావు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. రుణమాఫీ విషయంలో తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డివి చీట్ చాట్‌లు అని.. అబద్దాల ప్రచారానికి చిట్ చాట్‌లను వాడుకుంటున్నారని విమర్శించారు. రుణమాఫీపై రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని హితవు చెప్పారు. రుణమాఫీ చేయని గజ దొంగవి నువ్వు.. నన్ను దొంగ అంటావా? అని సీఎం రేవంత్‌పై ఘాటనై వ్యాఖ్యలు చేశారు హరీష్. రుణమాఫీ పాక్షికంగా జరిగిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు కదా అని గుర్తు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ మంత్రులు కూడా రుణమాఫీ కాలేదని చెప్పిన విషయాన్ని హరీష్ రావు ప్రస్తావించారు. “ఆగష్టు 15వ తేదీ లోపు వంద శాతం రుణమాఫీ చేస్తానని అన్నావ్.. చేశావా? ఓటుకు నోటులో రూ. 50 లక్షలు ఇస్తూ

మిగతా 2లో

# అధైర్య పడొద్దు.. అండగా నేనున్నా : చంద్రబాబు

వచ్చినప్పటి నుంచి చంద్రబాబు ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూనే ఉన్నారు. కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినుల ఆవేదన, ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని వేగంగా విచారణ జరపాలని తెలిపారు. సీక్రెట్ కెమెరాల ద్వారా చిత్రీకరణ జరిగిన విషయం నిర్ధారణ అయితే, అందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇది మన ఇంట్లో ఆడబిడ్డలకు వచ్చిన కష్టం అని భావించి, నిజాలు నిగ్గుతేల్చాలని పేర్కొన్నారు. తద్వారా ఆందోళనలో ఉన్న విద్యార్థినుల్లో ఒక భరోసా కల్పించాలని అన్నారు. ఇక, విద్యార్థినుల ఫిర్యాదును కాలేజి యాజమాన్యం పట్టించుకోలేదనే ఆరోపణలపైనా విచారణ జరపాలని ఆదేశించారు. యాజమాన్యం నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. విద్యార్థినుల వద్ద ఆధారాలు ఉంటే నేరుగా నాకు పంపండి అని చంద్రబాబు సూచించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై ప్రతి మూడు గంటలకు ఒకసారి తనకు రిపోర్ట్ చేయాలని చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు.కాగా, ఈ వ్యవహారంలో దర్యాప్తు కోసం కృష్ణా జిల్లా పోలీసులు ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందానికి గుడివాడ క్రైమ్ విభాగం సీఐ రమణమ్మ నేతృత్వం వహిస్తారని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ప్రకటించారు. ఈ బృందంలో ఐదుగురు సాంకేతిక నిపుణులు కూడా ఉన్నారు. ఈ స్పెషల్ టీమ్ గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కాలేజిని సందర్శించి దర్యాప్తుకు శ్రీకారం చుట్టింది. హిడెన్ కెమెరా ఆరోపణల నేపథ్యంలో, తాము నాన్ లినేయర్ జంక్షన్ డిటెక్టర్ (ఎన్‌ఎల్ జేడీ)ని ఉపయోగిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. త్వరలోనే ఈ కేసును పరిష్కరిస్తామని చెప్పారు.

# పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజ ంను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. దేశంలోనే అందరి దృష్టిని ఆకర్షించేలా హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దాలని అన్నారు.ఇప్పటికే పలు అంశాలపై దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి తాజాగా టూరిజంపై ఫోకస్ చేశారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై నూతన విధానం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట (యాదాద్రి) అభివృద్ధిపై కీలక ఆదేశాలను ముఖ్యమంత్రి జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మాదిరి యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారుతెలంగాణలో ఇప్పటికే పలు అంశాలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టూరిజంపై ఫోకస్ చేశారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై నూతన విధానం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట (యాదాద్రి) అభివృద్ధిపై కీలక ఆదేశాలను ముఖ్యమంత్రి జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మాదిరి యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు.

# ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ

(డిసెంబర్ 4) నాడు సింధుదుర్గ్‌లోని మల్వాన్ తహసీల్‌లోని రాజ్‌కోట్ కోటలో ప్రధాని మోదీ 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఈ విగ్రహం నాలుగు రోజుల క్రితం కుప్పకూలింది. అదే స్థలంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పునర్నిర్మిస్తామని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ క్షమాపణలు కోరారు. ఈ ఘటనపై తాను శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నానన్నారు. శివాజీ కేవలం మహారాజు మాత్రమే కాదని, ఆయన గౌరవనీయమైన వ్యక్తి అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో వద్వన్ ఓడరేవు,ఇతర ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడారు. ఛత్రపతి శివాజీని తమ పూజ్య దైవంగా ఆరాధించే వారందరి మనోభావాలు ఈ విగ్రహం కూలిపోవడం వల్ల దెబ్బతిని ఉంటాయి... అందుకే నేను క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. "మన సంస్కృతి భిన్నమైనది. మనకు గౌరవనీయ వ్యక్తులు, దైవం కంటే గొప్పది ఏదీ లేదు" అని స్పష్టం చేశారు. గత ఏడాది నేవీ డే (డిసెంబర్ 4) నాడు సింధుదుర్గ్ జిల్లా మల్వాన్ తహసీల్‌లోని రాజ్‌కోట్ కోటలో ప్రధాని మోదీ 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఈ విగ్రహం నాలుగు రోజుల క్రితం కుప్పకూలింది. అదే స్థలంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పునర్నిర్మిస్తామని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు.

## పాక్‌తో చర్చలు బంద్.. చర్యకు ప్రతిచర్యే: జైశంకర్

ఇరుగుపొరుగుదేశాలే జటిల ప్రశ్నలు అవుతున్నాయి. ఇదే విధంగా అగ్రరాజ్యాల ధోరణి కూడా ఉంటోంది. ప్రధాన శక్తులైన దేశాలకు పరిధి విస్తృతం అయి ఉంటుంది. వారి అజెండా ఎప్పుడూ ఇతరదేశాల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉంటుంది. అయితే ఇందులో తేడాలు ఉండొచ్చు. కొన్ని దేశాల పట్ల వైఖరిలో వ్యత్యాసాలు ఉండనే ఉంటాయని విశ్లేషించారు. మాజీ దౌత్యవేత్త రాజీవ్ సిక్రి రాసిన పుస్తకావిష్కరణలో జైశంకర్ బంగ్లాదేశ్ పరిణామాలు ఇతర విషయాలను కూడా ప్రస్తావించారు. ప్రదానంగా పాకిస్థాన్ వ్యవహారశైలి జటిలతను సృష్టిస్తోందని మండిపడ్డారు. జమ్మూ కశ్మీర్ విషయానికి సంబంధించి ఆర్టికల్ 370 నిర్ణయంతో పాకిస్థాన్‌కు తగు సమాధానం ఇవ్వడం జరిగిందనే భావిస్తున్నాం. ఇక ఈ దేశంతో ఎటువంటి సంబంధ బాంధవ్యాలు నెరపాలనేది ఇక ముందున్న అంశం అని తేల్చిచెప్పారు. అఫ్ఘనిస్థాన్‌కు సంబంధించినంత వరకూ ఈ దేశంతో వాస్తవికమైన పటిష్ట ప్రజా సంబంధాలు సామాజిక స్థాయిల వరకూ ఉన్నాయి. ఆ దేశం నుంచి భారత్ పట్ల నిర్ధిష్ట సృహద్భావత ఉందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులు ఇతర మైనార్టీలపై దాడులు ఆందోళనకరమే. రాజకీయ అస్థిరత్వ పరిణామంతో శాంతిభద్రతల క్షీణత ఏర్పడింది. దీనివల్లనే మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడి ప్రస్తుత ప్రభుత్వంతో సంప్రదించడం అనేది సహజ ప్రక్రియ అవుతుందన్నారు.

## ఆ విషయంలో ఇంకా మార్పులు చేయాల్సి ఉంది: రాజ్‌నాథ్ సింగ్

ఇరు దేశాలలో పర్యటించిన ప్రముఖుడు అని కొనియాడారు. దక్షిణ భాగంలో భారతదేశం అతిపెద్ద వాయిస్‌గా మారిందని, ప్రతి దేశం ఇప్పుడు ముఖ్యమైన సమస్యలపై భారతదేశం అభిప్రాయాన్ని తీసుకుంటున్నాయని వివరణ ఇచ్చారు. ఇంతకుముందు భారత దేశ ప్రధాని ఇతర దేశాల్లో పర్యటించినప్పుడు భారత్‌కు దక్కాల్సిన గౌరవం దక్కలేదని రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు.

## జపాన్‌లో బియ్యం కొరత.. సూపర్ మార్కెట్లలో నో స్టాక్ బోర్డులు

బియ్యం స్టాక్ మధ్యాహ్నానికే ఖాళీ అవుతోంది. మార్కెట్లో బియ్యం కొరత ఏర్పడిందనే వార్తలతో జపాన్ వాసులు ఆందోళనలతో సూపర్ మార్కెట్లకు పోటెత్తుతున్నారు. బియ్యం కోసం క్యూ కడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సూపర్ మార్కెట్లు, షాపుల యజమానులు బియ్యం కొనుగోలుపై రేషన్ విధించారు. ఒక కుటుంబానికి రోజుకు ఒక రైస్ బ్యాగ్ మాత్రమే అమ్మేలా చర్యలు తీసుకున్నారు.

**ఎందుకీ పరిస్థితి..?**

ఈ ఏడాది జపాన్ లో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సరిపడా నీరు లేక వరి సాగు తగ్గిపోయింది. ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్లో సహజంగానే బియ్యం కొరత ఏర్పడింది. దీనికి తోడు ఇటీవలి వరుస భూకంపాల నేపథ్యంలో భారీ భూకంపం రానుందని సైంటిస్టులు హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. మరోవైపు తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. వీటన్నింటి ఫలితంగా నిత్యావసర వస్తువులకు డిమాండ్ ఏర్పడింది. బియ్యం సహా ఇతరత్రా రోజువారీ అవసరాల కోసం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి ఇంట్లో స్టాక్ పెట్టుకుంటున్నారు. ప్రజల ముందుజాగ్రత్త చర్యల కారణంగా మార్కెట్లో బియ్యానికి కొరత మరింత పెరిగింది.

**ప్రభుత్వం ఏమంటోంది..?**

మార్కెట్లో బియ్యం కొరత తాత్కాలికమేనని జపాన్ వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు సూచించింది. పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, అలా చేయొద్దని విజ్ఞప్తి చేసింది. వరి సాగు విస్తీర్ణం గతంలో కంటే పెరిగిందని, వచ్చే నెలాఖరు నాటికి మార్కెట్లోకి పంట కోతకు వస్తుందని పేర్కొంది. కొత్త బియ్యం అందుబాటులోకి వస్తే బియ్యం కొరత తీరుతుందని వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు.

# నువ్వే అసలు దొంగ..

దొరికిన దొంగవు నువ్వు. నన్ను దొంగ అంటావా? రాహుల్ గాంధీని కూడా రుణమాఫీ అయిందని చీట్ చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్పాలి. నేనే రిసీవ్ చేసుకుని కొండారెడ్డి పల్లె తీసుకువెళతా. రుణమాఫీ అయిందో లేదో అడుగుదాం. వాస్తవాలు ఏంటో తెలుసుకుందాం.' అంటూ తనదైన శైలిలో ఘాటైన వ్యాఖ్యలు చేశారు హరీష్ రావు.వాల్మీకి స్కామ్ పట్ట పగలు నిలువు దోపిడీ లాంటిదని హరీష్ రావు అన్నారు. తెలంగాణలో 9 అకౌంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని చెప్పారు. దీనిపై ఈడీ రైడ్స్ ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. సీఎం వస్తే ఇద్దరం వెళ్లి దర్యాప్తు చేయమని ఈడీని కోరతామన్నారు. తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ బీజేపీ భాయి భాయి అన్నట్లుగా ఉందన్నారు. అందుకే వాల్మీకీ స్కామ్‌పై తెలంగాణలో విచారణ జరగడం లేదన్నారు. వాల్మీకీ స్కామ్‌పై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఈ స్కామ్‌పై ఈడీని కలిసి విచారణ జరపాలని కోరతామని హరీష్ రావు చెప్పారు.

**కూల్చివేతల సర్కార్..**

తెలంగాణలో ఏర్పాటైన కాంగ్రెస్ కూల్చివేతల సర్కారేఅని హరీష్ రావు విమర్శించారు.'హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌నుకూల్చివేశారు. వైద్య వ్యవస్థను పూర్తిగా కూల్చేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి ప్రజల విశ్వాసాన్ని కూల్చేశారు.' అని ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. అంతెందుకు హైడ్రా ఆఫీసే హుస్సేన్ సాగర్ నాలా కింద ఉందని, రంగనాథ్ ముందుగా ఆయన ఆఫీస్ కూల్చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ముందు రంగనాథ్ ఆఫీసును కల్చివేసి ప్రజల మీదకు రావాలన్నారు. చారిటీ బిగిన్స్ ఎట్ హోం అన్నట్టు.. ముందు నీ ఆఫీస్, జీహెచ్ఎంసీ ఆఫీసు కూలగొట్టాలని అన్నారు. మీరాలం, ఉప్పల్, రామంతపూర్ చెరువుల్లో పెద్ద పెద్ద టవర్స్ వచ్చాయని.. అవి పట్టా భూములువారికి పరిహారం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**రేవంత్‌కు బీజేపీ బెయిల్ ఇప్పించిందా?**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటి నీళ్లు ఎందులోకివెళ్తున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మంచిది కాదన్నారు. కమిషన్ కాకతీయ అని పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని.. ప్రభుత్వం వారిదే కాబట్టి విచారణ జరిపించుకోవచ్చునని హరీష్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజకు కనీసం మంత్రులు కూడా లేరని విమర్శించారు. తెలంగాణ తల్లి భావనకు రూపం ఇచ్చిందే కేసీఆర్ అని అన్నారు. ఆ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇదే సమయంలో కవితకు బెయిల్ అంశంపై సీఎం రేవంత్ స్పందించిన తీరును తప్పుపట్టారు. సీఎం స్థానంలో ఉండి న్యాయస్థానాల తీర్పుపై వక్ర భాష్యాలు చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇప్పించిందా? అని హరీష్ రావు ప్రశ్నించారు. తమకు సంస్కారం ఉందని.. రేవంత్‌లా నీచంగా తాము మాట్లాడలేమన్నారు. నీ సలహాదారు కేకే స్వాగతించారని.. నువ్వు మాత్రం వక్ర భాష్యాలు చెప్తావా? అంటూ సీఎం తీరుపై హరీష్ ఫైర్ అయ్యారు. ఈ పిచ్చి మాటల వల్లే ఇవాళ సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు.

**ప్రభుత్వ భూములు కాజేసే కుట్ర..**

ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని హరీష్ రావు ఆరోపించారు సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలను బయటపెడతామన్నారు. కందుకూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 9లో 385 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. అలాగే తుక్కుగూడ పరిధిలోని సర్వే నెంబర్ 895లో 25 ఎకరాల పేద రైతుల భూములు బినామీల పేరు మీదకు మారుతున్నాయని హరీష్ రావు ఆరోపించారు. ముచ్చర్లలో సీఎం తమ్ముళ్ల పీఏల పేర్ల మీద కూడా భూములు కొంటున్నారని అన్నారు.

**మోదీ మెప్పు కోసమే..**

సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి అరుణను గెలిపించారని హరీష్ రావు అన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఎందుకు మెజారిటీ తగ్గిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ మెప్పు కోసమే రేవంత్ రెడ్డి దగ్గరుండి బీజేపీకి ఓట్లు వేయించారని హరీష్ ఆరోపించారు. ముందు మహేందర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆ తరువాత తమను అడగాలన్నారు..

# అది చూసి ఏడ్చేశాను.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్:** సీఎం రేవంత్ పాలనా విధానాలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్ అయ్యారు. హైడ్రా అందరికీ ఒకే న్యాయం పాటించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలి కానీ.. పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు ఒక న్యాయం ఉండకూడదన్నారు. పేదల పైన వెంటనే యాక్షన్ తీసుకుంటున్న హైడ్రా..దుర్గం చెరువులో తిరుపతి రెడ్డి ఇంటికి ఎందుకు వెళ్ళలేదు అని ప్రశ్నించారు.మహబూబ్ నగర్‌లో అంధుల కాలనీలో అధికారులు ఇళ్ళు కూలుస్తున్నపుడు శిథిలాల్లో యూనిఫామ్ వేసుకున్న ఒక అమ్మాయి తన బుక్స్ వెతుక్కుంటోంది. ఈ దృశ్యం చూసి నాకు ఏడుపు వచ్చింది. సీఎంకి ఎలా నిద్రపడుతోంది? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 మంది పోలీసులతో అంధుల కాలనీ కూల్చిన అధికారులు.. అంతే మంది పోలీసులు తిరుపతి రెడ్డి ఇంటికి వెళ్లి ఎందుకు కుల్చరు? అని ప్రశ్నించారు. పేద ప్రజలపై ప్రతీకార పాలనలాగా రేవంత్ పాలన నడుస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో గురుకులాలు నిర్వీర్యం అయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో 9 నెలలుగా విద్యాశాఖకు మంత్రి లేరని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం ఎప్పుడైనా సమీక్ష జరిపారా? అని ప్రశ్నించారు. విద్యాశాఖపై సీఎంకు కనీస అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని.. విద్యార్థులకు యూనిఫామ్స్ లేవు, చలికాం వస్తుంది ఉలన్ రగ్గులు లేవు, బూట్లు ఇవ్వలేదని ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదని.. ప్రతీకార పాలన సాగుతోందని విమర్శించారు.చాలా కాలేజీల యాజమాన్యాలు ఫీజులు కట్టడం లేదనే కారణంగా మెమోలు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గురుకులాల్లో పేద విద్యార్థులు ఎంబీబీస్, ఐఐటీలు సాధించాలని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సు ఏర్పాటు చేశారని.. కానీ, ఇప్పుడు వాటిని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గెస్ట్ ఫాకల్టీకి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. వాళ్లు ఉద్యోగాలు మానేసేలా ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. పేద విద్యార్థులంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం అని ప్రశ్నించారు. వెంటనే గురుకుల కాలేజీల గెస్ట్ ఫాకల్టీకి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ స్కూళ్లలో కూడా అధ్యాపకుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా భరోసా కింద ఒక్కో విద్యార్థికి రూ.5 లక్షలు ఇస్తామన్నారని.. ఒక్క పైసా అయినా విడుదల చేశారా? అని ప్రభుత్వాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. కేసీఆర్ గురుకుల విద్యాలయాలను 250 నుంచి 1000 వరకు పెంచారన్నారు. దేశంలోనే రోల్ మోడల్‌గా గురుకులాలను తీర్చిదిద్దారని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాలను విస్మరిస్తోందన్నారు. గురుకులాల్లో అన్ని వర్గాల విద్యార్థులు విద్యను పొందుతున్నారని, అక్షయ పాత్ర సంస్థను విద్యాలయాలకు అంటకట్టడం సరికాదన్నారు. ధార్మిక సంస్థల భోజన విధానాన్ని అమలు చేయొద్దని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బ్రహ్మ కుమారి, అక్షయ పాత్ర సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు మానుకోవాలన్నారు. పేద విద్యార్థుల మీద ప్రయోగాలు చేయొదన్నారు. ఖైదీల తిండి కోసం రూ. 83 ఖర్చు చేస్తోందని.. కానీ విద్యార్థుల తిండి కోసం రూ. 37 మాత్రమే ఖర్చు చేస్తోందని విమర్శించారు.

## తెలంగాణలో 2028లో బిజేపిదే అధికారం: బండి సంజయ్



తెలంగాణ రాష్ట్రంలో 2028లో జరిగే ఎన్నికల్లో రానున్నది బిజెపి ప్రభుత్వమేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జోస్యం పలికారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చే పరిస్థితి లేదని, అంతారాసిపెట్టుకోండి 2028లో రానున్నది రామరాజ్యమేనని అన్నారు. తెలంగాణలో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లు అయిందని చెబుతూ కెసిఆర్ వద్ద శిక్షణ పొందిన కార్యకర్తలే కాంగ్రెస్ నాయకులని ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని నాగోల్ లో ఉన్న ఓ కన్వెన్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై మోర్చాలు, సెల్స్ సంయుక్త కార్యశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేశామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లో విలీనం ఖాయమని, త్వరలోనే అమెరికాలో అప్పగింతలు కాబోతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే 38 మంది ఎమ్మెల్యేలున్నా బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. బిజెపి కవితకు బెయిల్ ఇప్పించిందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోందని, సుప్రీంకోర్టుకు, తమ పార్టీకి ఏం సంబంధమని బండి ప్రశ్నించారు. సుప్రీంకోర్టును ధిక్కరించేలా కాంగ్రెస్ వ్యాఖ్యలు ఉన్నందునే కోర్టు హెచ్చరించిందని గుర్తు చేశారు. బిజెపి కుటుంబ, అవినీతి పాలనకు తాము వ్యతిరేకమని ఎట్టి పరిస్థితిలోనూ బీఆర్ఎస్‌తో కలువబోదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ గడీలను బద్దలు కొట్టిన చరిత్ర తమ పార్టీదేనని బండి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 109 కేసులు పెట్టిందని,రెండుసార్లు జైలుకు పంపిందని గుర్తు చేసిన ఆయన కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్నో అవమానాలను తట్టుకొని, దేశం కోసం, ధర్మం కోసం నిలిచిన పార్టీ బీజేపీ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాట ముచ్చట అయిపోయిందని, త్వరలో కలసిపోతాయనిబండి సంజయ్ ఆయా పార్టీలకు బదులిచ్చారు.

## ప్రధాని మోడీకీ మళ్లీ లేఖ రాసిన మమత



అత్యాచారం, హత్య వంటి కిరాతక నేరాలపై కేంద్రం కఠినాత్మక చట్టం తీసుకురావడం, మరణ శిక్ష విధించడం చేయాలన్న తన అభ్యర్థనను పునరుద్ఘాటిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీకి మరొక లేఖ రాశారు. ఈ నెల 9న కోల్‌కతాలోని ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఒక డాక్టర్‌పై హత్యాచారం ఘటనపై దేశవ్యాప్తంగా అలజడి రేగిన అనంతరం మమతా బెనర్జీ కొన్ని రోజుల క్రితం మోడీకి లేఖ రాశారు. అత్యాచారం, హత్యాచారం కేసులను నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన నిబంధన రూపొందించాలని ఆమె ఆ లేఖలో కోరారు.దోషులుగా నిర్ధారితులైన అత్యాచార నిందితులకు మరణ శిక్ష విధించేలా చూసేందుకు ప్రస్తుత చట్టాలకు ఒక సవరణను వచ్చే వారం రాష్ట్ర శాసనసభలో ఆమోదించనున్నట్లు మమత బుధవారం వెల్లడించారు. తాను రాసిన లేఖకు ప్రధాని నుంచి తనకు ఇంకా సమాధానం అందలేదని మమత వెల్లడిస్తూ, తనకు కేంద్ర మహిళా,శిశు వికాస శాఖ మంత్రి నుంచి ఒక లేఖ అందిందని తెలియజేశారు. తాను లేవదీసిన 'అంశం తీవ్రత ప్రస్తావన మాత్రమే' మహిళా శిశు వికాస శాఖ మంత్రి లేఖలో ఉందని మమత తెలిపారు, 'ఆ అంశం తీవ్రతను, సమాజంపై దాని ప్రభావాన్ని తగు విధంగా గుర్తించలేదు' అని మమత పేర్కొన్నారు.

## హామీలు అమలు చేయకుండా.. ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావ్?: ఈటల



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిజెపి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు. హైడ్రా పేరుతో హడావుడి చేస్తూ హైడ్రామా చేస్తోందని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. శుక్రవారం నాగోల్‌లో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదుపై వర్క్ షాప్‌లో పాల్గొన్న ఈటల మాట్లాడుతూ హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తానంటే అది మీ తరం కాదని, పేదల జోలికి వస్తే కబడ్దార్ అని హెచ్చరించారు. నిజంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే పనే చేయాలంటే ముందుగా బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇచ్చి అప్పుడు కూల్చి వేయాలన్నారు. అంతే తప్పు ఆరు గ్యారెంటీల హామీలపై చర్చ జరగకుండా ఎన్ని రోజులు తప్పించుకుంటారో చూస్తామని హెచ్చరించారు. ఇవాళ మీరు తప్పించుకోవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో మీకు శిక్ష తప్పదన్నారు.
మీరు రెడ్ బుక్ రాస్తున్నానని గతంలో చెప్పావు, బీజేపీ తరపున మేము కూడా నీ చిట్టా అంతా రాసుకుంటున్నామని సందర్భం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని పేర్కొన్నారు. రాజ్యంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు కామెంట్స్ చూస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎంత బాధ్యతా రహిత్యంగా, సంస్కారహీనంగా మాట్లాడుతున్నారో అర్థమవుతున్నదని అన్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అనుభవం కలిగిన పెద్ద లీడర్లు సైతం లోకల్ బాడీ ఎన్నికల పోటీలో ఉండబోతున్నారని రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని జేపీ నడ్డా, అమిత్ షా సైతం ఇదివరకే చెప్పారని అందువల్ల పార్టీ సభ్యత్వ నమోదు ప్రాముఖ్యతను అన్ని మోర్చాలు గుర్తించాలని సూచించారు.
బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన చూశామని వీరిని భరించే స్థితిలో లేమని బీజేపీనే గట్టిగా పోరాటం చేయాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో వెలిసిపోవడానికి ఐదేళ్లు పడితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం తొమ్మిది నెలలు కూడా పట్టలేదన్నారు. 2018 నాటికే కేసీఆర్‌ను ప్రజలు చీదరించుకున్నా ప్రయత్యామ్నాయం లేక పోపోవడంతో మరో సారి గెలిచారని ఆయన విమర్శించారు. అధికార పార్టీ కావడంతోనే గత స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు గెలుచుకోగలిగిందన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్.. ముగ్గురు కౌన్సిలర్లు బిజెపిలో చేరిక..




**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆగస్టు 30:** మున్సిపల్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఆదిలాబాదులో గులాబీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ముగ్గురు మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీని వదిలి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ముగ్గురు కౌన్సిలర్లు సంజయ్, వార్డు నెంబర్,(20), 6వ వార్డు కౌన్సిలర్ నెమలికొండ విఘ, 40 వార్డు కౌన్సిలర్ భరత్ కుమార్ లను సాదరంగా ఆహ్వానించి ఎమ్మెల్యే పాయల్ శంకర్ బిజెపి కండువాలు కప్పారు.
బీ ఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో పెరిగిన జనాధారణ, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బిజెపిలో చేరడం జరిగిందని కౌన్సిలర్లు తెలిపారు. పార్టీ కోసం సైనికుల్లా పనిచేస్తామని అన్నారు. వీరి వెంట 150 మంది కార్యకర్తలు బిజెపి కండువా కప్పుకున్నారు. కాగా ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్లో ముగ్గురు చేరికతో బిజెపి బలం 14 కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు లాలమున్న, కౌన్సిలర్లు ఉష్కెల రఘుపతి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, పార్టీ నాయకులు నగేష్, సచిన్, వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో కిండర్ కేర్ చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభం

**- సేవాదృక్పథంతో వైద్యసేవలు అందించాలి: చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య**





**శంకర్‌పల్లి ఆగస్టు 30 (డైలీ రిపోర్ట్):** ఆసుపత్రికి వచ్చే రోగులకు లాభాపేక్షతో కాకుండా సేవాదృక్పథంతో మెరుగైన వైద్యసేవలు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి పట్టణ పరిధిలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కిండర్ కేర్ చిల్డ్రన్స్ క్లినిక్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు ఆ ప్రాంతానికి రకరకాల ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్ కూడా విస్తరిస్తుందని, అటు వంటి అద్భుతస్థాయి అవకాశం శంకర్‌పల్లి కి ఉందన్నారు. పిల్లలకు, పెద్దలకు అందుబాటులో అత్యాధునిక సౌకర్యాలతో క్లినిక్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్లినిక్ యాజమాన్యం డాక్టర్ రవళి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే.. డాక్టర్ రవళిని అభినందించారు. డాక్టర్ రవళి మాట్లాడుతూ క్లినిక్ లో పుట్టిన పిల్లల నుండి పెద్దల వరకు చికిత్సలు చేస్తామన్నారు. పిల్లలకు వ్యాక్సినేషన్, పిల్లల పెరుగుదల వంటి చికిత్సలన్ని క్లినిక్ లో అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వైస్ ఛైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ శశిధర్ రెడ్డి, కౌన్సిలర్స్ శ్వేతా పాండు రంగారెడ్డి, చంద్రమౌళి, నాయకులు గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రకాష్, కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, దామోదర్ రెడ్డి, విజయ్, సత్తిరెడ్డి, భాస్కర్ ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ






**శంకర్‌పల్లి: ఆగస్టు 30: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను శుక్రవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసిపి బాలాజీ పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖ ద్వారా సైడ్ వాల్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తికావడానికి మరో 25 రోజుల సమయం పడుతుంది. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఉండుటకు గణేష్ నిమజ్జనం ప్రక్రియ పూర్తయ్యే వరకు పనులను నిలిపివేయాలని, ఆర్ అండ్ బి డిఈ ని కోరడం జరిగిందని, వారు దానికి అంగీకరించి మరో రెండు లేయర్స్ పనులు పెండింగ్ లో ఉన్నందున తాత్కాలికంగా మూడు రోజులు పనులు నిలిపివేస్తామని, గణేష్ నిమర్జనం ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రారంభిస్తామని చెప్పడం జరిగింది. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఫతేపూర్ బ్రిడ్జికి ఇరువైపులా వాహనదారులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఈ రమేష్, ఆర్ అండ్ బిఏఈ చంద్రశేఖర్, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్ వెంకటేశం, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోకిల గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్యను సన్మానించిన బిజెపి, కాంగ్రెస్ నాయకులు



**శంకర్‌పల్లి: ఆగస్టు 30: (డైలీ రిపోర్ట్):** మోకిల గ్రామ పంచాయతీ సెక్రటరీగా సి.ఎల్లయ్య ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎల్లయ్య కొండకల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ గా విధులు నిర్వహిస్తుండగా పై అధికారులు ఎల్లయ్య కి అదనంగా మోకిల గ్రామ పంచాయతీ సెక్రటరీగా నియమించారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల బిజెపి ఉపాధ్యక్షుడు వెంకటేష్, మోకిల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యం.. ఎంపీడీవో వెంకయ్య గౌడ్, పంచాయతీ సెక్రెటరీ ఎల్లయ్యలను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ జయరాజ్ ఉన్నారు.

# రాయికోడ్ తహశీల్దార్ కనుసానులలో మొరం వ్యాపారం

**- మొరం దందాకు సంబంధిత శాఖల వత్తాసు.**

**సంగారెడ్డి ఆగస్టు30(డైలీ రిపోర్ట్) :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలో గల నాగ్వార్ గ్రామ శివారులోని అసైన్డ్ భూమి అయిన83 సర్వేనెంబర్లో మొరం దందాకు అడ్డుకట్ట వేయకపోవడం సంబంధిత అధికారులపై పలువిమర్శలు వచ్చిపడుతున్నాయి.. దొంగలు దొంగలు కలిసి గట్లు పంచుకున్నట్లు అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు.. మొరం దందా ప్రాతినిత్యం కొనసాగిన జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారంటే క్రిందిస్తాయి అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం తెలుసుకోవచ్చని కొందరు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. గత వారం క్రితం మొరం పై పలు పత్రికాల్లో వార్త కథనాలు రావడంతో పై అధికారులు స్థానిక తహశీల్దార్ కు క్షేత్రస్థాయి లో పరిశీలించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని తెలుపగా తహశీల్దార్ మాత్రం మొరం వ్యాపరులకు ఫోన్లు చేసి ఈరోజు మొరం దందాను ఆపివేయలని తెలిజేశారనే ఆరోపణలు లేకపోలేవు.. అందుకు నిదర్శనం ఈరోజు కూడా అదే గ్రామ శివారులోని అసైన్డ్ భూముల్లో మొరం నడుస్తున్న రెవెన్యూ అధికారులు కనీసం కట్టడి చేయకపోవడం, మొరం వ్యాపారులు వార్తలు రాస్తే ఏమైతది




ఎమ్మార్వో కు కలిసి మళ్ళీ యెదావిదిగా దందాను కొనసాగిస్తాం అనడం గమనార్హం..

# ఎస్సీ ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

**- ఎస్సీ ఎస్టీలను అన్యాయంగా కేసులు ఇరికిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. - ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించాలి.**
**- జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులు ఎస్సీ ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు వసతి గృహాలను తనిఖీలు చేయాలి.**
**- మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు చేపట్టాలి. - జిల్లా అధికారులు ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులతో ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య సమీక్ష.**




**సంగారెడ్డి ఆగస్టు 30:** ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు , ఎస్పీ రూపేష్ ల ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కేసులు ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పోలీసు రెవెన్యూ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎస్సీ,ఎస్టీలను అనవసరంగా కేసుల్లో ఇరికించే పద్ధతులను పోలీసు సిబ్బంది విడనాడాలని ఫ్రెండ్లీ పోలీస్ లో భాగంగా ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ పోలీసు సిబ్బంది పని చేయాలని అన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు జిల్లా స్థాయి అధికారులు ఎస్సీ,ఎస్టీ గురుకుల పాఠశాలలను వసతి గృహాలను తరచు తనిఖీలు చేయాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు వేధింపులకు గురి చేసే అధికారులపై కఠిన చర్యలు కమిషన్ తరపున తీసుకున్నట్టు తెలిపారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు . ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన అన్ని రకాల కేసులను సెప్టెంబర్ ఆఖరులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రతినెల రోజులకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్,ఎస్పీలకు,ఎస్సీ కమిషన్ ఛైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్య మంచి భోజనం అందించేందుకు హాస్టల్స్ రెసిడెన్షియల్ స్కూల్స్ విధిగా అధికారులు విధిగా తనిఖీ చేయడం జరుగుతుందని ,పాఠశాలలో సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. భూమి సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలో సివిల్ సర్వీస్ డే కార్యక్రమాలు జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ,ఎస్టీల సంక్షేమం కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు వసతిగృహాల సమస్యల కోసం పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్,ఎస్పీ, ఎస్టి కమిషన్ ఛైర్మన్ కు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ లక్ష్మీనారాయణ రేణిగుంట ప్రవీణ్ నీలాదేవి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, డివిఎంఎస్ సభ్యులు, అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ భవిష్యత్తు తరగతి గదులలోనే ఉంది

- **చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి.**
- **పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి .**
- **ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శించిన ఎస్ సి ,ఎస్ టి ఛైర్మన్ బి. వెంకటయ్య**















**పటాన్చెరు, ఆగస్టు 30:** భారత మాజీ రాష్ట్రపతి గౌరవనీయులు డాక్టర్ అబ్దుల్ కలామ్ చెప్పినట్లు భారతదేశ భవిష్యత్తు తరగతి గదులలోనే ఉందని ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం పటాన్చెరువు మండలం, ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్ సి ,ఎస్ టి ఛైర్మన్ బి. వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కిచెన్ షెడ్ ,స్టోర్ రూమ్, భోజనశాలను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బంది కి సూచించారు. వంటగది స్టోర్ రూమ్ భోజనశాల పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పచ్చదనం పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ సి ,ఎస్ టి ఛైర్మన్ బి. వెంకటయ్య విద్యార్థులతో మాట్లాడారు. సీఎం గారి ఆదేశాల మేరకు జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్స్ లను పరిశీలించి గురుకులాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వ ముఖ్య నివేదిక సమర్పించాలని ఆదేశాలు ఉన్నందున పాఠశాలలో సందర్శించినట్టు తెలిపారు . విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నా దృష్టికి వచ్చిన సమస్యలను గౌరవ సీఎం గారి దృష్టికి, మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు అనుగుణంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యం సాధించేందుకు కష్టపడి చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.గురుకుల పాఠశాల విద్యార్థుల పొల్యూషన్ వల్ల అవస్థలు పడుతున్నరన్న విషయాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తో మాట్లాడి చర్యలు తీసుకుంటామనిపేర్కొన్నారు. NRGS కింద భాగంగా గురుకులంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పండించారు ఎంపీడీవోకు ఫోన్లో ఆదేశించారు . ఈ సందర్భంగా పాఠశాలల్లో రెజ్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు ఇప్పటివరకు 11 సార్లు రెజ్లింగ్ స్టేట్ ఛాంపియన్షిప్ రెండుసార్లు నేషనల్ మెడల్స్ పొందినట్లు పాఠశాల రెజ్లింగ్ కోచ్ ప్రియాంక ఎస్ సి ,ఎస్ టి ఛైర్మన్ కి తెలిపారు. పాఠశాలలో అండర్ 14 నుండి 17 సంవత్సరాలు వయసుగల విద్యార్థులు ఉన్నారని వారికి లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని క్రీడలు విద్యార్థి మానసి కోలాసానికి దోహదం చేస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు అన్ని రకాలుగా తీర్చిదిద్దడానికి గురుకుల పాఠశాలల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ లక్ష్మీనారాయణ రేణిగుంట ప్రవీణ్ నీలాదేవి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, తహసీల్దార్ రంగారావు , కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి , డివిఎంఎస్ సభ్యులు, అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వేళల్లో మార్పు

**- సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో బుకింగ్ కౌంటర్లు. - దూర ప్రాంతాల ప్రయాణికుల విన్నపం మేరకు నూతన టైమ్ టేబుల్......వికారాబాద్ సెక్షన్ రైల్వే కమర్షియల్ ఇన్స్పెక్టర్ వినోద్ రెడ్డి వెల్లడి.**



**శంకర్‌పల్లి: ఆగస్టు 30: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి వేళలు మారుస్తున్నట్లు వికారాబాద్ సెక్షన్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ వినోద్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగేవి. వివిధ వర్గాల ప్రజలు, బిడిఎల్, ఓడిఎఫ్ సంస్థల ఉద్యోగులు, స్థానికులు అభ్యర్థనల మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి పని వేళలు మారుస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. తాజాగా రేపటి నుండి నూతన వేళలు అమల్లోకి వస్తాయని, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ రిజర్వేషన్ల గురుంచి తెలుసుకొని సహకరించాలని కోరారు. సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బుకింగ్ కౌంటర్ తెరిచి ఉంటుందని, మధ్యాహ్నం ఒకటిన్నర గంటల నుంచి 2 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుందన్నారు. అదేవిధంగా గతంలో లాగే ప్రతి ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ తెరిచి ఉంటుందని సిఐ తెలిపారు. అదే విధంగా తత్కాల్ మాత్రం గతంలో లాగే ఏసీ తరగతుల్లో బుకింగ్ 10 గంటల నుండి, నాన్ ఏసీ స్లీపర్ బుకింగ్ 11 గంటల నుండి ప్రారంభం అవుతుందని శంకర్ పల్లి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ సూపర్వైజర్ రవీందర్ పేర్కొన్నారు.

# తన కూతురు వర్త్య మాధవి( 8) జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థుల మధ్యన గడిపిన తల్లి వర్త్య వసంత కుమార్



**శంకర్ పల్లి ఆగస్టు 30: (డైలీ రిపోర్ట్):** తన గారాలపట్టి కీర్తిశేషు రాలు ఎనిమిదేళ్లకే నిండు నూరేళ్ళు నిండిన, వర్త్య వసంత, వర్త్య కుమార్ ల ముద్దుల తనయ వర్త్య మాధవి (8) అకాల మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ.., మోకిల తండా ప్రాథమిక పాఠశాల చిన్నారులతో గడిపి వారిలో తన పాప చిరునవ్వులను గుర్తు చేసుకొని లోలోన మదన పడుతూ, తమ గుండె కోతను కడుపులోనే దాచుకొని, కాసేపు చిన్నారిలైన విద్యార్థులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులందరికీ బిస్కెట్స్, పెన్సిల్లు, ఎరేజర్, షార్ప్ నర్స్ మరియు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు

## వనపర్తి ఆలయంలో
# సిద్ధార్థ్- అదితీరావ్ పెళ్లి



లవ్ బర్డ్స్ అదితి రావ్ హైదరీ - సిద్ధార్థ్ 2021లో డేటింగ్ ప్రారంభించినప్పటి నుండి నిరంతరం వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో వనపర్తి సమీపంలోని శ్రీరంగపురం ఆలయంలో ఈ జంట నిశ్చితార్థం చేసుకోవడం ద్వారా తమ బంధాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లారు. ఈ వేడుక గురించి ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రత్యేక క్షణాన్ని అభిమానులతో షేర్ చేసుకున్నారు. అదితి రావ్ తన ప్రియుడు సిద్ధార్థ్ ప్రతిపాదన వెనుక ఉన్న హార్ట్ టచింగ్ స్టోరీని వెల్లడించింది. సిద్ధార్థ్ మోకాళ్లపై కూచుని నాకు ప్రపోజ్ చేసాడు అని అదితీ తెలిపింది. దివంగత అమ్మమ్మ ప్రారంభించిన పాఠశాలలో ఈ అనుభవం, ఘాడమైన సెంటిమెంట్ తనను కదిలించింది. అమ్మమ్మ ఆశీస్సులు దక్కాలనే అతడు నాకు అలా ప్రపోజ్ చేసాడని అదితీ మురిసిపోతూ చెప్పింది. కొన్నేళ్ల క్రితం మరణించిన అమ్మమ్మకు నేను అత్యంత సన్నిహితురాలిని. అమ్మమ్మ హైదరాబాద్‌లో పాఠశాలను ప్రారంభించింది. ఒక రోజు సిద్ధార్థ్ నేను ఎంత సన్నిహితంగా ఉన్నానో తెలుసుకుని, అతడిని చూడాలి అని అడిగింది. అని అదితీ చెప్పింది. అతడు ఇదే చోట మోకాలిపై కూచుని ప్రపోజ్ చేసాడు అని అదితీ తెలిపింది. ప్రపోజ్ చేయడంలో సిద్ధార్థ్ ఛమత్కారం తనను విస్మయపరిచిందని అదితీ తెలిపింది. ఈ చారిత్రాత్మక దేవాలయంలో సిద్ధార్థ్ ని పెళ్లి చేసుకుంటానని, త్వరలోనే ముహూర్తం ఫిక్స్ అయ్యాక తెలియజేస్తానని కూడా అదితీ కన్ఫామ్ చేసింది. ఒకటి కాదు.. రెండు రాజ వంశాలకు చెందిన రాకుమారి. ఆమె హైదరాబాద్‌లో ఎహసాన్ హైదరీ- విద్యారావు దంపతులకు జన్మించింది. వలస పాలనలో హైదరాబాద్ మాజీ ప్రధాని అక్బర్ హైదరీ మునిమనవరాలు. ఆమె తాత రాజా జె రామేశ్వర్ రావు వనపర్తి కుటుంబానికి చెందిన రాజా. ఎట్టకేలకు అదితి రావ్ హైదరీ- సిద్ధార్థ్ పెళ్లి వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. తెలంగాణలోని వనపర్తిలో 400 ఏళ్ల నాటి ఆలయంలోనే తమ పెళ్లి వేడుక జరగనుందని, ఇది తన కుటుంబానికి ప్రత్యేక సెంటిమెంటుగా ఉంటుందని అదితి తెలిపారు. ఈ ఏడాది చివర్లో ఈ జంట పెళ్లి పీటలు ఎక్కే అవకాశం ఉంది. 2021లో ప్రేమ కథ మొదలు: అజయ్ భూపతి తెరకెక్కించిన సినిమా సెట్స్‌లో సిద్ధార్థ్ - అదితి మొదటిసారి కలుసుకున్నారు. అదితి.. సిద్ధార్థ్ ఇద్దరికీ ఇది రెండో పెళ్లి. అదితీ గతంలో నటుడు సత్యదీప్ మిశ్రాను పెళ్లాడారు. ఈ జంట 2009 -2013 వరకు కలిసి ఉన్నారు. అటుపై ఈ బంధం ముగిసింది. అలాగే సిద్ధార్థ్ గతంలో మేఘనాను పెళ్లాడారు. ఈ జంట 2007లో విడాకులు తీసుకున్నారు.

## కేతిక పాప..
# అలా ముద్దుగా..



యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన కేతిక శర్మ, మోడలింగ్ ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించింది. ఆకాష్ పూరి సరసన 'రొమాంటిక్' సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టిన కేతిక, మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. సినిమాలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా అనంతరం కేతికకు కొత్త అవకాశాలు వచ్చాయి. నాగ శౌర్యతో 'లక్ష్య' సినిమాతో పాటు వైష్ణవ్ తేజ్ సరసన 'రంగ రంగ వైభవంగా'లో నటించింది. అయితే, ఈ రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో కేతికకు పెద్దగా గుర్తింపు రాలేదు. అయినప్పటికీ, తన అందం, యాక్టింగ్ ప్రతిభతో కుర్రతరం మనసులు గెలుచుకుంటూనే ఉంది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్, సాయి తేజ్ నటించిన 'బ్రో' సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. ఈ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించినప్పటికీ, కేతికకు ఆశించినంత గుర్తింపు మాత్రం రాలేదు. అయినప్పటికీ, సోషల్ మీడియాలో ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం కేతిక తనకు సరైన అవకాశాలు రావాలని ఎదురు చూస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, కొత్త ఫోటోషూట్లను పంచుకుంటూ, ఫాలోవర్స్‌ను ఆకట్టుకుంటోంది. త్రోబ్యాక్ ఫోటోలు, స్టైలిష్ లుక్స్ తో ఆమె ఆకట్టుకుంటోంది. రీసెంట్ గా అమ్మడు మరోసారి స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. పెదవులు రౌండ్ గా చేసి తన కురులను అలా వదిలేసింది. ఫ్రేమ్‌లో అమ్మడు ఎంతో చూడముచ్చటగా ఉందని ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. టాలీవుడ్‌లో మంచి బ్రేక్ కోసం కేతిక ఎదురుచూస్తున్న ఈ సమయంలో, తన టాలెంట్‌ను చూపించేందుకు అమ్మడు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఆ మధ్య ఒక కోలీవుడ్ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు చెప్పింది. అలాగే వెబ్ సీరీస్ లు కూడా చేయనున్నట్లు కేతిక వివరణ ఇచ్చింది. కానీ వాటిపై అఫీషియల్ గా ఎలాంటి అప్డేట్స్ లేవు. మరి రాబోయే రోజుల్లో ఈ బ్యూటీ ఎలాంటి పాత్రల్లో కనిపిస్తుందో చూడాలి.

## మానుషి స్ట్రైకింగ్
# కిల్లింగ్ లుక్స్

అక్షయ్ కుమార్ - మానుషి చిల్లర్ ఆన్-స్క్రీన్ జోడి చాలా మందికి ఆసక్తిని కలిగిస్తుంది. ఈ జంట తెరపై ఎబ్బెట్టుగా కనిపిస్తోందని విమర్శలున్నాయి. ఇంతకుముందే ఈ జంటపై పాట విడుదలైన వెంటనే నెటిజనులు తమ అసమ్మతిని వ్యక్తం చేసారు. తనకంటే 30 ఏళ్లు చిన్నవాడైన మానుషితో రొమాన్స్ చేయడానికి అంగీకరించినందుకు నెటిజన్లు అక్షయ్ కుమార్‌పై విరుచుకుపడ్డారు. సూపర్ స్టార్ అక్షయ్ ని ఆన్‌లైన్‌లో విపరీతంగా ఎగతాళి చేసారు. అతడు ఆమెకు తండ్రిలా ఉన్నాడంటూ అక్కీని దెప్పి పొడిచారు. బాలీవుడ్‌లో తక్కువ వయసు హీరోయిన్లతో రొమాన్స్ చేసే వాడిగా అక్షయ్ కుమార్ ని నిలదీస్తున్నారు నెటిజనం. నిజ జీవితంలో అతని డౌన్-టు-ఎర్త్ వినయపూర్వకమైన స్వభావం కారణంగా భారీ అభిమానులను కలిగి ఉన్నాడు. అయితే అక్షయ్ తాజా ప్రాజెక్ట్‌ల్లో హీరోయిన్ల ఎంపిక చూశాక అతడి ఎంపికలను నెటిజనులు తూర్పారబడుతున్నారు. బడే మియాన్ చోటే మియాన్ తాజా పాటలో అక్షయ్ కుమార్ మానుషి చిల్లర్ రొమాన్స్ ని యూత్ వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం అక్షయ్, టైగర్ ష్రాఫ్, మానుషి చిల్లర్, ఆలయ ఎఫ్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి పెప్పీ సాంగ్ వల్ల హబీబీ విడుదలైంది. ఇందులో ప్రధాన జోడీలు, అక్షయ్-మానుషి .. టైగర్- అలయ జంటలు హాట్ అవతార్‌లో దర్శనమిచ్చారు. నలుగురూ తమ డ్యాన్స్ మూవ్‌లను సెన్సావల్ ట్రాక్‌లో అదరగొట్టారు. అయితే అక్షయ్ -మానుషి మధ్య కెమిస్ట్రీ కోఆర్డినేషన్ దృష్టిని ఆకర్షించింది. ఈ జంట గతంలో సామ్రాట్ పృథ్వీరాజ్ చిత్రంలో కలిసి నటించారు. అయితే 30 ఏళ్ల చిన్న వయసులో ఉన్న మానుషి చిల్లర్‌తో రొమాన్స్ చేసినందుకు నెటిజన్లు అక్షయ్ కుమార్‌ను నెటిజనులు నిందిస్తూనే ఉన్నారు. ఇది సిగ్గుచేటు అని కొందరు వ్యాఖ్యానించారు. ఆన్ లొకేషన్ కెమెరా మూవ్ మెంట్: మరోవైపు మానుషి చిల్లర్ కి బాలీవుడ్ లో లక్ చిక్కలేదు. తనని తాను నిరూపించుకునేందుకు ఈ అందాల రాణి చాలా కాలంగా ప్రయత్నిస్తూనే ఉంది. ఇప్పుడు బడే మియాన్ చోటే మియాన్ పై చాలా హోప్స్ పెట్టుకుంది. సోషల్ మీడియాల్లో వీలున్నంత వరకూ తనవంతు ప్రచారం చేస్తూనే ఉంది. తాజాగా ఆన్ లొకేషన్ విజువలైజేషన్ కి సంబంధించిన ఒక ఆసక్తికర వీడియోని మానుషి షేర్ చేసింది. ఇది అంతర్జాలంలో వైరల్ గా మారింది.



# మాస్ మసాలా విందు రెడీ అవుతోంది..!



రవితేజ తో 'క్రాక్', బాలకృష్ణ తో 'వీర సింహా రెడ్డి' సినిమాలు రూపొందించి బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న దర్శకుడు గోపీచంద్ మలినేని ఒక భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ను రూపొందిస్తున్నాడు. మొదట ఈ సినిమాను ఒక తెలుగు హీరోతో అనుకున్నాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా క్యాన్సిల్ అయ్యింది. దాంతో బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీ డియోల్ తో దర్శకుడు గోపీచంద్ ఆ సినిమాను ప్రస్తుతం చేస్తున్నాడు. తెలుగు, హిందీలో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కి సంబంధించిన అప్‌డేట్స్ ను రెగ్యులర్ గా దర్శకుడు గోపీచంద్ మలినేని ఇస్తూనే ఉన్నాడు. ఒకప్పుడు పలు సూపర్ హిట్ సినిమాలు చేసిన సన్నీ డియోల్ కొంత కాలంగా సక్సెస్ లు లేకపోవడంతో నిరాశతో ఉన్నాడు. ఆ సమయంలో వచ్చిన 'గదర్ 2' సినిమా సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. సన్నీ డియోల్ పనైపోయింది అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా పుంజుకుని ఉవ్వెత్తున ఎగిశాడు. దాంతో ఆయన్ను హీరోగా పెట్టి మళ్లీ సినిమాలు నిర్మించేందుకు పెద్ద బ్యానర్ లు సైతం ముందుకు వస్తున్నాయి. గదర్ 2 హిట్ నేపథ్యంలో ఆయనతో గోపీచంద్ మలినేని సినిమాకు రెడీ అయ్యాడు. వీరి కాంబో మూవీ ని మైత్రి మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ నిర్విరామంగా, శరవేగంగా జరుగుతోందని చిత్ర యూనిట్ సభ్యులు తెలియజేస్తున్నారు. తాజాగా దర్శకుడు గోపీచంద్ మలినేని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ లో ఈ సినిమా కి సంబంధించిన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నట్లు చెప్పుకొచ్చాడు. ప్రముఖ ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ను సన్నీ డియోల్ పై చిత్రీకరిస్తున్నామని, ఒక భారీ మాస్ మసాలా విందు రెడీ అవుతోంది అన్నట్లుగా ట్వీట్ చేశాడు. గోపీచంద్ మలినేని ట్వీట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గదర్ 2 సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆయన నుంచి వస్తున్న సినిమా అనగానే హిందీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇలాంటి సమయంలో తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని రూపొందిస్తున్న ఈ సినిమా ను వారు ఎలా ఆధరిస్తారా అంటూ అంతా ఆసక్తిగా చూస్తున్నారు. నెట్టింట ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పలు విషయాలు వైరల్ అవుతున్నాయి. సౌత్ దర్శకులు ఈ మధ్య కాలంలో బాలీవుడ్ ను దున్నేస్తున్నారు. కనుక గోపీచంద్ మలినేని కూడా ఈ సినిమా తో బాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం మాత్రమే కాకుండా అక్కడి ఫిల్మ్ మేకర్స్ ఇంకా స్టార్స్ ని కూడా సర్‌ప్రైజ్ చేసే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.